క్లుప్తంగా...

బస్సు సర్వీసులను పున: ప్రారంభించాలని వినతి



బోడుప్పల్: 5వ డివిజన్ పరిధిలో ఆర్టీసీ బస్సు సర్వీసులను పున: ప్రారంభించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి సోమవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సులు లేక డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సులను పున: ప్రారంభించి ఇబ్బందులు లేకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. అందుకు స్పందించిన సజ్జనార్ వెంటనే అధికారులను ఆదేశించారని పద్మారెడ్డి వెల్లడించారు. వినతి పత్రం అందజేసిన వారిలో 5వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పబ్బు సత్యనారాయణ పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని సుమారు 16 కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.4.40 కోట్లను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. డివిజన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, నాలా పూడికతీత పనులపై కూడా మేయర్‌తో చర్చించారు. మేయర్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ బస్తీ దవాఖానాలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ కేంద్రాన్ని సోమవారం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నారాయణ రావు, కమిషనర్ వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. నాణ్యమైన వైద్యంతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు సైతం ఉచితంగా అందజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సేవలను ప్రారంభించిందన్నారు. ఈ కేంద్రంలో 51 రకాల రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, కొడె పోచయ్య, నవీన్‌రెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బండారి రవీందర్, సాయిలు, డాక్టర్ భార్గవి, నర్సులు పాల్గొన్నారు.

గౌడ విద్యావంతుల వేదిక అధ్యక్షుడిగా ఉపేందర్‌గౌడ్



అల్వాల్: తెలంగాణ గౌడ విద్యావంతుల వేదిక అధ్యక్షులుగా కానాజీగూడ సుభాష్‌నగర్‌కు చెందిన పల్లె ఉపేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సామాజికవర్గం సమస్యల పరిష్కారానికి ఐదేళ్ల క్రితం ఏర్పాటు అయిన గౌడ విద్యావంతుల వేదిక మరింత పటిష్టంగా పనిచేయడానికి కృషి చేస్తామని అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ అన్నారు. ఉపాధ్యక్షులుగా నరేందర్‌కుమార్‌గౌడ్, సునీల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వి. శ్రీకర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సుభాష్‌గౌడ్, వి.రాములుగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విజయ్‌కుమార్‌గౌడ్, కోశాధికారిగా మహేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

పెళ్లికి వచ్చి అదృశ్యమైన తల్లీ కొడుకు



తేజశ్వరి, కేశవ నారాయణ (ఫైల్)

కుషాయిగూడ: తెలిసిన వారి వివాహానికి హాజరైన ఓ తల్లి, కొడుకు అదృశ్యమైన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్‌ఐ షఫి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం, పలాసా మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన వామెరవల్లి తేజశ్వరి(40) గృహిణి. ఈ నెల 26న నగరంలోని చిన్న చర్లపల్లిలో జరిగే తెలిసిన వారి పెళ్లి కోసం తన ఐదేళ్ల కొడుకు కేశవ నారాయణతో పాటు ఇరుగు, పొరుగు వారితో కలిసి ఈ నెల 24న ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. 26 ఉదయం సికింద్రాబాద్‌కు చేరుకుకొని అక్కడి నుంచి చిన్న చర్లపల్లిలోని పెళ్లివారింటికి వెళ్లారు. 26న వివాహం జరిగింది. అందరితో కలిసి పెళ్లివారిని కలిసి గంటపాటుగా అక్కడే గడిపి కనిపించకుండా పోయింది. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఆందోళన చెందిన వారు పలుచోట్ల వెతికారు. ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అడుగుకో గుంత..

గుంతకో ప్రమాదం

- బోడుప్పల్ ప్రధాన రహదారులన్నీ గతుకులమయం
- వాహనదారులకు, ప్రయాణికులకు నిత్యం నరకం
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం



అధ్వానంగా చిలుకానగర్ వైపు వెళ్లే రహదారి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. గడిచిన 5 ఏళ్ల నుంచి ఈ రహదారుల గురించి అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారిపోయాయి. ఈ పాడైపోయిన రహదారులపై వాహనదారులు, పాదచారులు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. మరీ ముఖ్యంగా అంబేద్కర్ విగ్రహం నుంచి చిలుకానగర్ వైపు వెళ్లే రహదారి అడుగుకో గుంత పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారులు..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ పాడైపోయాయి. 5 ఏళ్ల క్రితం ప్రధాన రహదారులన్నింటికీ బీటీ రోడ్లు వేశారు. భారీ వాహనాలు వల్ల, వర్షాలకు బీటీ రోడ్లన్నీ పెద్ద పెద్ద గుంతలుగా మారాయి. ప్రస్తుతం ఏర్పడిన పాలకవర్గం మూడున్నర సంవత్సరాలుగా ప్రధాన రహదారులకు నిధులు కేటాయించకుండా అవసరం ఉన్నా లేకపోయిన అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయించి విన్నర్ రోడ్లు, డ్రైనేజీ పనులు, ఇతర సౌకర్యాలు కల్పించారు.

ప్యాచ్ వర్క్ పనులకు ప్రాధాన్యం

గడిచిన 5 ఏళ్ల నుంచి రోడ్డు పనులు చేపట్టకుండా కేవలం ప్యాచ్ వర్క్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్యాచ్‌వర్క్ పనులకు తూతూ మంత్రంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు. ఇలా చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు కొద్ది కాలానికే పాడైపోవడంతో రోడ్లపై వాహనదారులు, పాదచారులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోడుప్పల్ నగర ప్రజలు మాత్రం నిత్యం ఈ హదారుల వల్ల ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నట్లు వెల్లడించారు.

అధ్వానంగా చిలుకానగర్ వైపు వెళ్లే రహదారి

బోడుప్పల్ నుంచి చిలుకానగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరిగాయి. చిలుకానగర్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడటంతో ఇటీవల మట్టిపోశారు. సదరు గుంతలో తాగునీటి పైపులైన్ పగిలి లీకేజీ కావడంతో సదరు గుంత వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయమై స్థానిక ప్రజలు మున్సిపల్, జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి..



చిలుకానగర్ రోడ్డులోని ప్రియా బార్ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడి గుంతకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. రోడ్ల పైకి వర్షపు నీరు, ఇళ్లలో నీరు రావడంతో రోడ్లు పాడైపోతున్నాయి. అధికారులు స్థానిక ప్రజలకు అవేర్‌నెస్ కల్పించి రోడ్ల పైకి నీరు రాకుండా చూడాలి. ప్యాచ్‌వర్క్ పనులకు కేటాయించిన నిధులతో వెంటనే మరమ్మతుల చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్, 11వ డివిజన్ కార్పొరేటర్

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అధికారులకు సూచించారు. సోమవారం ఆనంద్‌బాగ్‌లోని క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఏ విభాగానికి కేటాయించిన రోజుల్లో ఆ కార్యక్రమాలను లోటుపాట్లు లేకుండా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ మొదటి రోజు నివాళులర్పిస్తూ జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమాలను జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ పర్యవేక్షిస్తారని అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతం చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతయాదవ్, మీనారెడ్డి, జితేంద్రనాథ్, మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు, నాగమణి, మల్కాజిగిరి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అల్వాల్ మండల డిప్యూటీ తహసీల్దార్ రేణుక, ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ రవియాదవ్, నాగరాజు, ట్రాఫిక్ సీఐ సుధీర్‌కృష్ణతోపాటు వివిధ విభాగాల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు రాచకొండ సీపీ అభినందనలు



విజేతలకు అభినందిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

అల్వాల్: భవిష్యత్‌లో రాచకొండ కమిషనరేట్ తరపున మరిన్ని పతకాలు సాధించాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. రాచకొండ పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. పతకాలు సాధించిన అధికారులు సోమవారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో కమిషనర్ అభినందించారు. ఈ నెల 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లోని పోస్టల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రెండవ నేషనల్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ – 2023లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ నుంచి ఎం.60 ఏజ్ గ్రూప్‌లో పురుషుల 109 కేజీ కేటగిరిలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఎం.55 ఏజ్ గ్రూప్‌లో పురుషుల 81 కేజీ కేటగిరిలో ప్రదీప్ కుమార్ ఏఏఓ రెండవ స్థానం సాధించారు. ఎం.35 ఏజ్ గ్రూప్‌లో పురుషుల 109 కేజీ కేటగిరిలో పవన్ రామకుమార్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. పవన్ రామకుమార్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆగస్టులో పోలాండ్‌లో జరగబోయే ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించిన నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ నుంచి అన్ని విధాలా ప్రోత్సాహం, తోడ్పాటు అందిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

యూత్ డిక్లరేషన్‌తో ఎన్నో ప్రయోజనాలు



మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: యూత్ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం నాచారం డివిజన్ బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యువతీ యువకులకు ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూరే యూత్ డిక్లరేషన్‌ను బూత్‌స్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరే విధంగా చూడాలని కోరారు. తెలంగాణ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగంతో పాటు తల్లిదండ్రులు, భార్యకు నెలకు రూ.25 వేల చొప్పున అమరవీరుల గౌరవ పెన్షన్ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీఎస్.ప్రకాష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు,

సౌకర్యాలు కల్పించాలని వినతి

అల్వాల్: మచ్చబొల్లారం జొన్నబండలో సౌకర్యాలు కల్పించాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో విద్యుత్ లైన్లు, మంచినీటి సరఫరా చేయాలని కోరారు. త్వరలో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేష్, కొండయ్య, రాజు, మధు, నాగులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్‌లో నివాసముంటున్న శివశంకర్‌రెడ్డి, రజితల కుమారుడు శ్రావన్‌కుమార్‌రెడ్డి సివిల్స్‌లో ఆల్ ఇండియా 426వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు బైటింటి శారదా ఈశ్వర్‌రెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

- ఉత్సాహంగా బీఎల్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్
- హాజరైన మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఆర్
- విజేత కాప్రా ప్రెస్‌క్లబ్ జట్టు



విజేతగా కాప్రా ప్రెస్‌క్లబ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: యువత అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బీఎల్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్ల క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహద పడతాయన్నారు. చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత అవకాశాలు సొంతమవుతాయన్నారు. అనంతరం బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువతలో చైతన్యం నింపేందుకే క్రీడాపోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని డివిజన్లలో క్రీడా పోటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని బీఎల్‌ఆర్ ట్రస్టు అందజేస్తుందన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఉప్పల్, కాప్రా ప్రెస్‌క్లబ్ జట్లకు మధ్య జరిగిన పోటీలో కాప్రా ప్రెస్‌క్లబ్ జట్టు 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి విజేతగా నిలిచింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయకులు బైరి నవీన్‌గౌడ్, సాయిజెన్‌శేఖర్, బద్రోద్దీన్, ఇంద్రయ్య, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బైరి భాస్కర్‌గౌడ్, నరసింహ, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, రమేష్, శ్రవణ్, ఇందిరాగౌడ్, సుజాత, మచ్చ పాండు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం కాప్రా డివిజన్‌లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.316.10 లక్షలతో సాయిపురికాలనీ, పద్మారావునగర్, ఎల్లారెడ్డి, శంఖుకాలనీ, సాయిబాబానగర్, నేతాజీనగర్, అశోక్‌మణిపురి కాలనీ, మాణిక్‌సాయినగర్ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సూడుగు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో..

ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డితో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.227.60 లక్షలతో డివిజన్‌లోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్, టీపీసీసీ కార్యదర్శి, ఉప్పల్ బి-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీరెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. దశాబ్ది వేడుకలు

హబ్సిగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఉప్పల్ నియోజకవర్గంలో వైభవంగా జరుపుకుందామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం హబ్సిగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించి అవగాహన కల్పించారు. ఉప్పల్, కాప్రా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు అరుణకుమారి, శంకర్, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైకులు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న మల్కాజిగిరి ఇన్‌చార్జి డీసీపీ ఆర్.గిరిధర్

మేడిపల్లి: దురలవాట్లకు బానిసైన ఇద్దరు వ్యక్తులు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నారు. మేడిపల్లి పోలీసులు వారిని పట్టుకున్నారు. సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఇన్‌చార్జి డీసీపీ ఆర్.గిరిధర్ కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం, తాళ్లచెర్వు గ్రామవాసి గొల్లపుడి చంటి(38) భార్య, ఇద్దరు పిల్లలతో బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. వనస్థలిపురం, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పార్క్ చేసిన 13 ద్విచక్ర వాహనాలను నకిలీ తాళం చెవులతో దొంగిలించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నాడు. పోలీసులు బోడుప్పల్ సిగ్నల్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. 13 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొత్తూరు షాద్‌నగర్‌కు చెందిన పత్‌లావత్ గోపాల్‌నాయక్(36)పాతనేరస్తుడు. ఇతడు గతంలో షాద్‌నగర్, తుకారాం గేట్ పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో అరెస్టై విడుదలయ్యాడు. అయినా పద్ధతి మార్చుకోకుండా మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలను దొంగిలించాడు. మేడిపల్లి క్రైమ్ టీం, మల్కాజిగిరి టీంలుగా ఏర్పడి అనుమానితులను గుర్తించారు. వీరిపై పీడీ యాక్ట్ నమోదు చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి, డీఐ ప్రవీణ్ బాబు, మల్కాజిగిరి డీఐ రవిబాబు, మేడిపల్లి డీఎస్‌ఐ లక్ష్మణ్, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు. పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పేరుతో ప్రభుత్వం మోసం

- లక్షల దరఖాస్తులు.. పూర్తయినవి 50 వేలు
- ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం
- పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే పెద్దఎత్తున నిరసన
- కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: పేదల కోసం నిర్మించిన డబుల్ ఇళ్ల కోసం ఇంకా ఎన్నేళ్లు నిరీక్షించాలంటూ కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. డబుల్ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు నిర్మాణం పూర్తయిన డబుల్ ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను అర్హులకు కేటాయించడంలో ప్రభుత్వం అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తోందని ఆయన ప్రశ్నించారు. లక్షల్లో దరఖాస్తులు ఉంటే కేవలం 50 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం డబుల్ ఇళ్లను కేటాయించకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు నాటకాలు ఆడుతూ ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. దీన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అలసత్వం వీడి అర్హులైన వారందరికీ డబుల్ ఇళ్లను కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, పత్తికుమార్, మేడల మల్లికార్జున్‌గౌడ్, వంగేటి సంజీవరెడ్డి, నెలుట్ల శ్రీనివాస్‌గౌడ్, గడ్డం యాదగిరి, సముద్రాల కృష్ణమూర్తి, పోలేపాక అంజయ్య, జలగం వెంకటేష్, నీరజారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



డబుల్ ఇళ్ల కోసం చేపట్టిన నిరసనలో కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి